నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: ఆజామాబాద్ డివిజన్ పరిధిలో విద్యుత్ మరమ్మతుల నేపథ్యంలో పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏడీఈ నాగేశ్వర్‌రావు తెలిపారు. డీడీ హెచ్ ఫీడర్ పరిధిలోని దుర్గాబాయి దేశ్‌ముఖ్ ఆస్పత్రి, విజ్ఞాన్‌పురికాలనీ, వీఎస్‌టీ మెయిన్ రోడ్, ఎస్‌ఆర్‌టీ క్వార్టర్స్, దయానంద్ నగర్ తదితర ప్రాంతాలలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు..

- రాంనగర్, నల్లకుంట ఫీడర్ల పరిధిలోని రాంనగర్ శ్రీనివాస టెక్స్‌టైల్, ఈసేవా, గవర్నమెంట్ స్కూల్, బండారు దత్తాత్రేయ హౌస్, విజయబ్యాంక్, తిలక్‌నగర్ రోడ్, భారత్ ఇనిస్టిట్యూట్, ఫీవర్ ఆస్పత్రి తదితర ప్రాంతాలలో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 1.30 వరకు..
- సీసీ షరఫ్ ఫీడర్ పరిధిలోని సీసీ షరఫ్ ఆస్పత్రి, భూమన్నగల్లీ, రాజేంద్రనగర్‌కాలనీ, లింగంపల్లి, కాచిగూడ రైల్వేస్టేషన్ తదితర ప్రాంతాలలో మధ్యాహ్నం 2గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

అమిత్‌షాను బర్తరఫ్ చేయాలి

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్.అంబేడ్కర్‌ను అవమానపరుస్తూ మాట్లాడిన కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షాను వెంటనే మంత్రి పదవి నుంచి తొలగించాలని రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా (బొజ్జ తారకం) తెలంగాణ అధ్యక్షుడు జన్ను సాంబయ్య, ప్రధాన కార్యదర్శి రమేష్ డిమాండ్ చేశారు. బాగ్‌లింగంపల్లిలో జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ... మన దేశంలో అతి ఉన్నతమైన లౌకిక ప్రజాస్వామిక రాజ్యాంగాన్ని మార్చేయాలని చూస్తున్నారని అన్నారు. రాబోయే రోజుల్లో మనువాద రాజ్యాంగాన్ని ప్రవేశపెట్టి నియంత పాలనను కొనసాగించాలనే దురుద్దేశంతో ఇలాంటి వ్యాఖ్యలు చేస్తున్నారని ఆరోపించారు. అంబేడ్కర్ వారసులమని చెప్పుకునే వివిధ సంఘాల నాయకులు మేధావులు, సామాజికవేత్తలు స్పందించాలన్నారు. అమిత్‌షాను బర్తరఫ్ చేసే వరకు తమ పోరాటాన్ని ఆపమన్నారు. మహాత్మా జ్యోతిరావు పూలే, అంబేడ్కర్ ఆశయ సాధన కోసం పని చేస్తూ రాజ్యాధికారమే లక్ష్యంగా బహుజనులంతా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.

డీజేడీఈఏ ఉపాధ్యక్షుడిగా మడుగు శ్రీనివాస్



సుందరయ్యవిజ్ఞానకేంద్రం: దివ్యాంగ్‌జన్ డెఫ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ (డీజేడీఈఏ) రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా మడుగు శ్రీనివాస్ నియమితులయ్యారు. గద్వాల జోగులాంబ జోన్ పరిధిలోని కేడీఆర్ పాలిటెక్నిక్ కళాశాలలో సీనియర్ అసిస్టెంట్‌గా మడుగు శ్రీనివాస్ పనిచేస్తున్నారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ.. బాగ్‌లింగంపల్లిలోని అసోసియేషన్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో రాష్ట్ర అధ్యక్షుడు కె.శివానందం, ప్రధాన కార్యదర్శి ఎస్.శివప్రసాద్, గౌరవ అధ్యక్షుడు వల్లభనేని ప్రసాద్ తనను నియమించినట్లు పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న దివ్యాంగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. పీఆర్‌సీ, ప్రమోషన్, బదిలీల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.

కేలండర్ ఆవిష్కరణ

యాకుత్‌పురా: హైదరాబాద్ సిటి సివిల్ కోర్టు బార్ అసోసియేషన్ 2025 నూతన సంవత్సర కేలండర్‌ను పురానీహవేలీలోని కోర్టు భవనంలో గురువారం చీఫ్ జస్టిస్ రేణుకా యారా ఆవిష్కరించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వై. శ్రీనివాసాచారి, ప్రధాన కార్యదర్శి దుబ్బాక హర్షవర్ధన్, ఉపాధ్యక్షురాలు కే.ప్రవీణారెడ్డి, సంయుక్త కార్యదర్శి బర్కా రాజేశ్ కుమార్, కోశాధికారి విశాల్ సింగ్ పాల్గొన్నారు.

కళాతోరణంలో విరాట్ భక్తి సత్సంగ్ షురూ

నాంపల్లి: తెలుగు లలిత కళాతోరణంలో పరమ పూజ్య సుధాన్షు జీ మహారాజ్ సత్సంగ్ గురువారం రాత్రి ప్రారంభమయ్యింది. నాలుగు రోజుల పాటు ఇవి కొనసాగనున్నాయి. ప్రతిరోజూ సాయంత్రం 4.30 నుంచి రాత్రి 7.30 గంటల వరకు ఆధ్యాత్మిక ప్రవచనాలు, మెడిటేషన్, భజన కార్యక్రమాలు ఉంటాయి. మాజీ ఎమ్మెల్యే, విశ్వ జాగృతి మిషన్ అధ్యక్షుడు ప్రేమ్‌సింగ్ రాథోడ్ పర్యవేక్షణలో జరుగుతున్నాయి. ఈ నెల 29న ఆదివారం ఉదయం 11 గంటలకు గురు మంత్ర దీక్ష ఉంటుంది. మొదటి రోజు వర్షం కారణంగా అరగంట ఆలస్యంగా ప్రారంభించి అరగంట ముందే ముగించారు.

ఆకట్టుకున్న కూచిపూడి నృత్యం

గన్‌ఫౌండ్రీ: రవీంద్రభారతీలో ప్రముఖ నృత్య శిక్షణాలయం కళా నృత్య నికేతన్ స్కూల్ ఆఫ్ కూచిపూడి అకాడమీ 16వ వార్షికోత్సవ వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ మాట్లాడుతూ.. 2007లో సంస్థను స్థాపించి వందలాది మంది కళాకారులను తయారు చేయడం ఎంతో అభినందనీయమన్నారు. నాట్య గురువు డాక్టర్ బిందు అభినయ్ ఆధ్వర్యంలో సంస్థకు చెందిన 146 మంది విద్యార్థులు వివిధ అంశాలపై చేసిన నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో పద్మశ్రీ డా.పద్మజారెడ్డి, భాగవతుల సేతురాం, పద్మశ్రీ ఉమామహేశ్వరీ, కళాకృష్ణ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో మహా పడిపూజ



అయ్యప్ప పడి పూజలో పాల్గొన్న భక్తులు

నల్లకుంట: గురుస్వామి గుమ్మడి విశ్వనాథ్ ఆధ్వర్యంలో బుధవారం సాయంత్రం సత్యానగర్ బస్తీ కమ్యూనిటీహాల్‌లో అయ్యప్పస్వామి మహా పడిపూజ భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. శబరిమల పూర్వ మేల్‌తాంత్రిక్ శంకరన్ నంబూద్రి, డాక్టర్ ఎస్.రాజు గురుస్వాముల పర్యవేక్షణలో హరి హర నందన్ భజన మండలి ప్రవీణ్‌స్వామి బృందం చే అయ్యప్ప పడిపూజ భజన చేశారు. అనంతరం అయ్యప్పస్వామి ఆభరణాల ఊరేగించి అయ్యప్ప పల్లకీ సేవ నిర్వహించారు. పడిపూజలో అయ్యప్ప మాలధారులు దూసరి శ్రీనివాస్‌గౌడ్, ఎం.సతీష్ చంద్రగౌడ్, గుమ్మడి విక్రమం, వెంకట్‌గౌడ్, మహేందర్, అమర్, అరవింద్ తదితరులు పాల్గొన్నారు.

మోతిమార్కెట్‌లో..

కాచిగూడ: మోతిమార్కెట్‌లో గురువారం అయ్యప్పస్వామి మహా పడిపూజను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అయ్యప్పస్వామిని కార్పొరేటర్ ఉమారాణి దర్శించుకుని పూజలు చేశారు. కార్యక్రమంలో కిషోర్ గురుస్వామి, జగదీష్ గురుస్వామి, హరి స్వామి, బీజేపీ నేతలు రమేష్ యాదవ్, బి.భీమ్‌రాజ్, ఆర్.సంతోష్, రాము, రవి యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

18వ అయ్యప్ప పడిపూజ

అంబర్‌పేట: బాగ్‌అంబర్‌పేట డివిజన్ పరిధిలోని అంబేడ్కర్ కమ్యూనిటీహాల్‌లో జెల్లి శ్రీమంత్ గురుస్వామి ఆధ్వర్యంలో 18వ అయ్యప్పస్వామి పడిపూజ గురువారం వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఖైరతాబాద్ జిల్లా కాంగ్రెస్ ప్రధానకార్యదర్శి తొలుపునూరి కృష్ణగౌడ్, గడ్డం లక్ష్మణ్‌గౌడ్, గడ్డం శ్రీధర్‌గౌడ్, వెంకట్‌గౌడ్, అనిల్‌కుమార్, రంగంపల్లి రాజు, చందు పటేల్, శశిగౌడ్, జలంధర్, జిత్తు బుచ్చిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



కాచిగూడలో జరిగిన పడిపూజలో కార్పొరేటర్ కన్నె ఉమా రమేష్ యాదవ్



బాగ్‌అంబర్‌పేటలో జరిగిన పడిపూజలో జెల్లి శ్రీమంత్‌గిరి, కృష్ణగౌడ్

కార్యాలయాల్లో ఆర్‌టీఐ బోర్డులు ఏర్పాటు చేయాలి



చింతల రాఘవేందర్‌కు నియామకపు పత్రాన్ని అందజేస్తున్న డా.చంటిముదిరాజ్

కాచిగూడ: సమాచార హక్కు చట్టం సాధన కమిటీ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడిగా చింతల రాఘవేందర్ ముదిరాజ్‌ను నియమించినట్లు కమిటీ జాతీయ వ్యవస్థాపక అధ్యక్షుడు డా. చంటి ముదిరాజ్ తెలిపారు. ఈ మేరకు గురువారం రాఘవేందర్‌కు నియామకపు పత్రాన్ని ఆయన అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. సమాచార హక్కు చట్టం సామాన్యుడి చేతిలో వజ్రాయుధం లాంటిదని అన్నారు. సమాచార హక్కు చట్టాన్ని ప్రతి ప్రభుత్వ కార్యాలయంలో పకడ్బందీగా అమలు చేయాలన్నారు. ఆర్‌టీఐ బోర్డులు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ప్రజలు కోరిన సమాచారాన్ని 30 రోజుల్లోపు అందజేయాలని అన్నారు. వ్యక్తిగత స్వేచ్ఛకు భంగం కలిగినప్పుడు, ప్రాణహాని ఉన్నప్పుడు కేవలం 48గంటలలో సమాచారం అధికారులు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో మల్లం వెంకటేశం, సూర స్రవంతి, జి.ప్రియా రెడ్డి, బత్తుల మహేష్‌గౌడ్, రాసునూరి లక్ష్మణ్, ముచ్చర్ల మల్లేష్, సత్యం తదితరులు పాల్గొన్నారు.

రాజాడీలక్స్ చౌరస్తా.. అధ్వానం రోడ్డంతా.!



ముషీరాబాద్‌లోని రాజాడీలక్స్ చౌరస్తా వద్ద రోడ్డు గుంతలమయంగా మారింది. దీనికి తోడు వర్షపునీరు గుంతలలో నిలిచిపోవడంతో పాదచారులు, వాహనాదారులు ఇబ్బంది పడుతున్నారు. 1000 ఎంఎం మంచినీటి పైపులైన్ నిర్మాణ పనులు సైతం కొనసాగుతుండటంతో ప్రజల రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. ఇదిలా ఉండగా పైపులైన్ నిర్మాణ పనులు పూర్తయ్యాకే రోడ్లు వేస్తామని అధికారులు పేర్కొంటున్నారు.
– ముషీరాబాద్

కాళోజీకి పీవీ నరసింహారావు స్మారక పురస్కారం



మాట్లాడుతున్న డా.హనుమాన్ చౌదరి

కాచిగూడ: పీవీ నరసింహారావు మెమోరియల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో భారత మాజీ ప్రధాని, భారత రత్న పీవీ నరసింహారావు స్మారక పురస్కారాన్ని స్వాతంత్ర్య సమరయోధులు ప్రజాకవి, పద్మవిభూషణ్ కాళోజీ నారాయణరావుకు అందిస్తున్నట్లు ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి మాదంశెట్టి అనిల్‌కుమార్, ప్రతినిధులు పద్మశ్రీ డాక్టర్ టి.హనుమాన్ చౌదరి, సీఎస్‌బీ ఐఏఎస్ అకాడమీ డైరెక్టర్ మల్లవరపు బాలలత, పోల విజయబాబు, సూర్య నాయక్, శ్రీకర్ శర్మ తెలిపారు. గురువారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ ఈ నెల 28వ తేదీన రవీంద్రభారతిలో పీవీ నరసింహారావు స్మారక పురస్కారాన్ని కాళోజీ నారాయణరావు తరపున కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత డాక్టర్ నలిమెల భాస్కర్‌కు అందజేయనున్నట్లు తెలిపారు. 15 మార్చి 2024న ముంబైలో పీవీ నరసింహారావు స్మారక పురస్కారాన్ని పద్మవిభూషణ్ రతన్ నావల్ టాటాకు, 8 మే 2024న హిమాచల్‌ప్రదేశ్‌లో 14వ దలైలామాకు అందజేయడం జరిగిందన్నారు. రవీంద్రభారతిలో రాష్ట్ర మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అధ్యక్షతన జరిగే కార్యక్రమానికి రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ముఖ్యఅతిథిగా పాల్గొంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బొమ్మ మహేష్ కుమార్ గౌడ్, ఎమ్మెల్సీ టి.జీవన్ గౌడ్, ఆర్.కృష్ణయ్య, గడ్డం వివేక్ వెంకటస్వామి, సురభి వాణిదేవి, పివి ప్రభాకర్, డాక్టర్ వెన్నెల గద్దర్ తదితరులు పాల్గొంటారని తెలిపారు.

28న అయ్యప్ప పడిపూజ



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న రత్నసాయిచంద్, వినయ్‌కుమార్

చిక్కడపల్లి: గాంధీనగర్ కార్పొరేటర్ పావని ఆధ్వర్యంలో కవాడిగూడ మెయిన్ రోడ్డులోని శ్రీనివాస గ్రౌండ్స్‌లో ఈనెల 28న తేదీన అయ్యప్ప పడిపూజ నిర్వహించనున్నారు. కార్పొరేటర్ కార్యాలయంలో బీజేపీ డివిజన్ అధ్యక్షుడు రత్నసాయిచంద్ గురువారం పడిపూజ ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు. ఈ పూజకు భక్తులందరూ ఆహ్వానితులేనని అన్నారు. సమీక్షలో బీజేపీ సికింద్రాబాద్ పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ ఎ.వినయ్‌కుమార్, సీనియర్ నాయకులు శ్రీకాంత్, దామోదర్, ఎం.ఉమేష్, సురేష్, శ్రీనివాస్, విజయలక్ష్మి పాల్గొన్నారు.

మోతె జగన్నాథం మృతి తీరనిలోటు



కాచిగూడ: జనగామ జిల్లా అమ్మాపురం మోతె జగన్నాథం మృతి తనను కలచి వేసిందని టీడీహెచ్‌ఏ ట్రస్ట్ చైర్మన్ వేదకుమార్ మణికొండ ఓ ప్రకటనలో తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. 'బొమ్మలోల్లు'అని అప్యాయయంగా పిలుచుకునే మోతె జగన్నాథం, చెక్క తీగల తోలుబొమ్మలాట ద్వారా శతాబ్దాల నాటి కథా సంప్రదాయాన్ని పరిరక్షించడానికి అంకితమైన కళాకారుల బృందానికి నాయకత్వం వహించారని ఆయన పేర్కొన్నారు. ప్రస్తుతం తెలంగాణలోని వరంగల్ ఉమ్మడి జిల్లాలో ఒకే మోతె కుటుంబానికి చెందిన రెండు బృందాలు మాత్రమే మిగిలాయని అన్నారు. దేశంలో సాంస్కృతిక అవగాహనను పెంపొందించే జగన్నాథం చెక్క తీగల తోలుబొమ్మల బృందంతో అనేక వర్క్‌షాపులు, ప్రదర్శనలు నిర్వహించారని తెలిపారు.

కార్మికులు సంఘటితం కావాలి

లిబర్టీ: కార్మిక చట్టాల అమలు కోసం కార్మికులు సంఘటితంగా పోరాటం చేయాలని అఖిల భారత అసంఘటిత కార్మికుల ఉద్యోగుల కాంగ్రెస్ తెలంగాణ రాష్ట్ర శాఖ ప్రధాన కార్యదర్శి పింగళి సంతప్‌రెడ్డి అన్నారు. విడిపోతే పడిపోతామని, కార్మికులు ఐక్యంగా ఉంటే సమస్యలు వెంటనే పరిష్కారం అవుతాయన్నారు. కార్మికుల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాడుతున్న ఆటో యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లేష్‌ను ఆత్మీయ సత్కారం చేసి అభినందించారు. సంతప్‌రెడ్డి మాట్లాడుతూ కార్మిక చట్టాలు పూర్తిస్థాయిలో అమలు కాకపోవడం వల్ల కార్మికులు ఇబ్బందులు పడుతున్నారన్నారు.

'శ్రీ శూద్రగంగ' పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న రచయిత సుద్దాల అశోక్‌తేజ, ప్రొ. కాసీం, సినీ నటుడు ఉత్తేజ్

కవాడిగూడ: సినీగేయ రచయిత సుద్దాల అశోక్ తేజ రచించిన శ్రీ శూద్రగంగ (కావ్య రూపం) పుస్తకాన్ని గురువారం పుస్తక ప్రదర్శనలో ఆవిష్కరించారు. యోగి వేమన విశ్వవిద్యాలయం తెలుగు శాఖ ప్రొ. వినోదిని మాదాసు అధ్యక్షతన తెలంగాణ ప్రజా సాంస్కృతిక కేంద్రం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆర్ట్స్ కాలేజీ ప్రిన్సిపాల్ ప్రొ.కాసీం, లోకకవి అందెశ్రీ, ప్రముఖ సినీ నటుడు, రచయిత ఉత్తేజ్, ప్రముఖ కవి విమర్శకులు బెల్లి యాదయ్య, కోయి కోటేశ్వర్‌రావులు హాజరయ్యారు. ఈ సందర్భంగా సుద్దాల అశోక్‌తేజ మాట్లాడుతూ... ఈ భూమి శూద్రభూమి, శ్రామికుల భూమి, గంగ కూడా శూద్రులదేనని అందుకే ఈ శూద్ర గంగా పుస్తకాన్ని రచించినట్లు పేర్కొన్నారు. ప్రొఫెసర్ కాసీం మాట్లాడుతూ... చాలా స్పష్టమైన అవగాహనతో కావ్యానికి మొట్టమొదటిసారి ఓ గొప్ప పేరు పెట్టిన కవి గుర్రం జాషువా అని ఆయన రచించిన కావ్యానికి 'గబ్బిలం'అని పేరుపెట్టినట్లు తెలిపారు. అనంతరం అందె శ్రీ, ఉత్తేజ్ తదితరులు ప్రసంగించిన వారిలో ఉన్నారు.

చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి



వారణాసిలో జరిగిన రింగ్ టెన్నీస్ పోటీలో సత్తాచాటిన తెలంగాణ బాల బాలికలు

కాచిగూడ: చదువుతో పాటు విద్యార్థులు క్రీడల్లో రాణించాలని రింగ్ టెన్నీస్ జాతీయ కార్యదర్శి శ్యామ్‌సుందర్ అన్నారు. ఈనెల 22 నుంచి 25వ తేదీ వరకు ఉత్తరప్రదేశ్‌లోని వారణాసిలో నిర్వహించిన అండర్–15 రింగ్ టెన్నీస్ చాంపియన్‌షిప్ పోటీల్లో తెలంగాణకు చెందిన బాల, బాలికలు పాల్గొని తమ ప్రతిభను చాటారు. రింగ్ టెన్నీస్ పోటీల్లో తెలంగాణ విద్యార్థులు 2 వెండి పతకాలు, 3 కాంస్య పతకాలు, ఇతర 4 మెడల్స్‌ను సాధించారు. గురువారం కాచిగూడ నెహ్రూనగర్‌లో శ్యాంసుందర్, ఎం.విశ్వనాథం మాట్లాడుతూ.. తమ విద్యార్థులకు ప్రభుత్వం సహకారం అందిస్తే భవిష్యత్‌లో మరింతగా రాణించగలుగుతారని అన్నారు.

సామాజిక సేవలో భాగస్వాములు కావాలి



వివేకానంద సేవా సంఘం ఆశ్రమంలో అన్నప్రసాద వితరణ చేస్తున్న నిర్మల

కాచిగూడ: ప్రతి ఒక్కరూ సామాజిక సేవలో పాల్గొని తమవంతు సహాయ, సహకారాలు అందించాలని ప్రముఖ గాయకురాలు, ఎస్పీ నిర్మల సాంస్కృతిక సంగీత సేవా సంస్థ అధ్యక్షురాలు నిర్మల పిలుపునిచ్చారు. వివేకానంద సేవా సంఘం ఆశ్రమంలో గురువారం అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని ఆమె నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్మల మాట్లాడుతూ.. తమ సంస్థ ఆధ్వర్యంలో వివిధ రకాల సామాజిక సేవలను అందిస్తున్నట్లు తెలిపారు. ప్రతి ఒక్కరూ తమవంతు బాధ్యతగా సహాయ, సహకారాలు అందించాలని కోరారు.

మలేషియాలో తెలుగు వర్సిటీ కోర్సుల నిర్వహణపై ఒప్పందం



ఒప్పందం చేసుకుంటున్న దృశ్యం

నాంపల్లి: తెలుగు భాష నాలుగేళ్ల డిప్లొమా కోర్సును నిర్వహించేందుకు మలేషియా తెలుగు సంఘం (టీఏఎం) పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంతో ఒప్పందం కుదుర్చుకుంది. ఈ మేరకు మలేషియాలోని రవాంగ్ పట్టణంలో గురువారం జరిగిన సమావేశంలో పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య వెలుదండ నిత్యానందరావు, రిజిస్ట్రార్ ఆచార్య కోట్ల హనుమంతరావు, టీఏఎం అధ్యక్షుడు డాక్టర్ వెంకట ప్రతాప్, ఉపాధ్యక్షులు సత్తయ్య, సుధాకర్ నాయుడు, సురేశ్ నాయుడు, గౌరవ సలహాదారులు అచ్చయ్య కుమార్ సమక్షంలో ఒప్పందం జరిగింది. ఈ సందర్భంగా ఉపాధ్యక్షుడు ఆచార్య వెలుదండ నిత్యానందరావు మాట్లాడుతూ.. మలేషియాలో స్థిరపడ్డ ఎం.సోమా నాయుడు, డి.వి.శ్రీనివాసులు, అప్పల నాయుడు కృషి ఫలితంగానే మలేషియాలో తెలుగు కోర్సుల ప్రారంభానికి శ్రీకారం చుట్టామన్నారు. మలేషియా తెలుగు సంఘం గౌరవ సలహాదారు, ప్రసిద్ధ వైద్యుడు అచ్చయ్య కుమార్ మాట్లాడుతూ.. రవాంగ్ పట్టణంలో తెలుగు సంస్కృతి, ఆచార వ్యవహారాలు ప్రతిబింబించేలా, తెలుగు అకాడమీ పేరుతో విశాల భవన సముదాయాన్ని నిర్మించి తెలుగు సంప్రదాయ పండుగలను, ఆచార వ్యవహారాలు తెలిసేలా సమ్మేళనాలు సమావేశాలను జరుపుతున్నామన్నారు. నాలుగేళ్ల డిప్లొమా కోర్సుతో ఇక్కడివారికి ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందని తెలుగు మలేషియా సంఘం అధ్యక్షుడు డాక్టర్ వెంకట ప్రతాప్ పేర్కొన్నారు. రిజిస్ట్రార్ ఆచార్య హనుమంతరావు మాట్లాడుతూ.. తెలుగు భాషలో సర్టిఫికెట్ కోర్సు, డిప్లొమా కోర్సుల ఉపాధ్యాయులకు శిక్షణతో పాటు సిలబస్, పరీక్షల నిర్వహణ బాధ్యతలను తెలుగు వర్సిటీ తీసుకుంటుందని తెలిపారు.

మహాలక్ష్మి హాస్టల్ అక్రమాలపై విచారణ జరపాలి



మహాలక్ష్మి హాస్టల్ ఎదుట ధర్నా చేస్తున్న ప్రజా సంఘాల నాయకులు

ముషీరాబాద్: ఆర్టీసీ క్రాస్ రోడ్‌లో ఎటువంటి అనుమతులు లేకుండా మహాలక్ష్మి పేరుతో బాలికల హాస్టల్‌ను నడుపుతూ అందులో అనేక అక్రమాలకు పాల్పడుతున్న యాజమాన్యంపై ప్రభుత్వం కఠిన చర్యలు చేపట్టాలని ఐద్వా రాష్ట్ర సహాయ కార్యదర్శి కె.నాగలక్ష్మి, నగర అధ్యక్షురాలు ఏ.పద్మలు డిమాండ్ చేశారు. ఈ విషయంపై హాస్టల్ ముందు ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. హాస్టల్‌లో బాలికలకు యాజమాన్యం ఎటువంటి సౌకర్యాలు కల్పించడం లేదన్నారు. ఆ హాస్టల్‌కు రెవెన్యూ డిపార్ట్‌మెంట్, ఫైర్ సేఫ్టీ, ఫుడ్ సేఫ్టీ అనుమతి లేవన్నారు. పైగా బాలికల హాస్టల్‌లో వార్డెన్‌గా ఖచ్చితంగా మహిళలే ఉండాలనే నిబంధనలు ఉల్లంఘించారని అన్నారు. మద్యానికి బానిసైన వ్యక్తిని వార్డెన్‌గా నియమించిందన్నారు. బాలికలు ఏదైనా సమస్య ఉందని చెబితే హాస్టల్ ఓనర్ వారిని దుర్భాషలాడుతూ రేప్ చేస్తామని బెదిరిస్తున్నారని అన్నారు. ఈ విషయంపై విద్యార్థి నాయకులు యాజమాన్యంతో మాట్లాడడానికి వెళ్తే వారిపై కర్రలతో దాడి చేసి తీవ్రంగా గాయపరిచారన్నారు. ఈ హాస్టల్‌ను వెంటనే మూసేయాలని హాస్టల్ యాజమాన్యాన్ని తక్షణం అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని ఐద్వా, ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ సంఘాల ఆధ్వర్యంలో డిమాండ్ చేస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో అశోక్‌రెడ్డి, జావేద్ తదితరులు పాల్గొన్నారు.

పోరాటాలు చేసేది సీపీఐయే..



గోల్నాకలో సీపీఐ జెండాను ఎగురవేస్తున్న అంబర్‌పేట నియోజకవర్గ ఇన్‌చార్జి వెంకటేశం

కాచిగూడ: పేదలు, కార్మికులు, కర్షకుల సంక్షేమం, అభివృద్ధి కోసం నిరంతరం పోరాటం చేసేది సీపీఐ మాత్రమేనని అంబర్‌పేట నియోజకవర్గం సీపీఐ ఇన్‌చార్జి, ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి బి.వెంకటేశం అన్నారు. సీపీఐను స్థాపించి వందేళ్లయిన సందర్భంగా గురువారం గోల్నాకలో సీపీఐ పతాకాన్ని ఆయన ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో నేతలు ఎ.భిక్షపతి, సీహెచ్ జంగయ్య, ఎస్.అశోక్, బి.తిరుమలేశ్‌గౌడ్, శ్యామ్‌నాయక్, ఎస్‌కే లతీఫ్, శ్రీను, కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

వందేళ్ల సంబురాలు

ఆదర్శమూర్తి మహాత్మా గాంధీ



ముషీరాబాద్: మహాత్మాగాంధీ జీవితం అందరికి స్ఫూర్తి అని ఆయన ఆశయ సాధనకు కాంగ్రెస్ పార్టీ నిరంతరం కృషి చేస్తోందని మాజీ ఎంపీ వి.హనుమంతరావు అన్నారు. కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడిగా 1924లో గాంధీజీ బాధ్యతలు చేపట్టి నేటికి వందేళ్లయిందన్నారు. ఈ సందర్భంగా గురువారం ముషీరాబాద్ గాంధీనగర్ చౌరస్తాలోని మహాత్మాగాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అహింసా మార్గంలో దేశ ప్రజలందరినీ ఏకం చేసి స్వాతంత్ర్యం తీసుకొచ్చిన వ్యక్తిగా గాంధీజీ ప్రపంచానికి మార్గదర్శకంగా నిలిచారన్నారు. మహాత్మాగాంధీ సిద్ధాంతాలు, ఆశయాలను కాంగ్రెస్ కొనసాగిస్తూ రాబోయే ఎన్నికల్లో అధికారంలోకి రావడానికి పార్టీ శ్రేణులు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ కార్యదర్శి జి.ఎన్.కేశవ్, మైనార్టీ కమిషన్ చైర్మన్ దీపక్‌జాన్, బాగ్ అంబర్‌పేట్ అధ్యక్షుడు గడ్డం శ్రీధర్‌గౌడ్, నాయకులు లింగంగుప్తా, పీటర్, నాగేంద్రప్రసాద్, కోటం అనిల్‌కుమార్, మనోజ్, చిరంజీవి, జమీల్, సునీల్, జహంగీర్ తదితరులు పాల్గొన్నారు.